ఓం

శ్రీః

# కొత్త గీత

దీనిని వ్రాసినవాడు

## మార్కండేయప్రసాద్

108 శ్రీకర రెసిడెన్సీ,

ఇన్నర్ రింగ్ రోడ్, గోరంట్ల,

గుంటూరు

ఆంధ్రప్రదేశం - 522034

చరవాణి :: 9440260163

నా అర్థాంగి శ్రీమతి బాలాంత్రపు మెహెర్ లక్ష్మికి అంకితం

# అంకితం

ఏమీ తోచని నేను,

దీనిని ఏంచేయాలో తోచక,

అంతకంటె గూడ మరీ తోచని

నా అర్ధాంగి

మెహెర్ లక్ష్మికి,

## అంకితం

చేస్తున్నా!

నా అర్ధాంగి శ్రీమతి బాలాంత్రపు మెహెర్ లక్ష్మికి అంకితం

# కొత్త గీత

1. శ్రీకర్ కంకిత మిచ్చిన
   పోకిరి పద్యాల కంటె పోకిరి పద్యా,
   లేకశతమివి మెహర్ ల
   క్ష్మీ! కైకో, నీ కొరకని గిలికితి వీనిస్

2. కలియుగము మొదట కృష్ణుడు
   కలిసిన యెడ సవ్యసాచి కడుమోదముతో
   " అలనాటి నీ విభూతిని
   తెలుపుము నేడ" నిన, నవ్వి తెలుపు హరి యిటుల్ .

( కలియుగం మొదటిలో కృష్ణుడు గనుక కలిసి ఉంటే, 'ఆప్పటి నీ ఆ విభూతి ఇప్పుడు ఎలా ఉంటుందో చెప్పు.' అని అర్జునుడు అడిగి ఉంటే గనుక, కృష్ణుడు నవ్వుటాలకు ఇలా చెపుతాడన్న మాట ! ఎవరూ లబలబలాడకండి.)

3. వంకలలో నెలవంకను,
   కుంకలలో నేను కూసుకుంకను పార్థా!
   అంకెలలో మూడంకెను,
   డొంకలలో నేను ముళ్ళడొంకను సుమ్మీ!

(మూడంకె = ముడుచుకొని పడుకోవటం)

4. ఆకులలో తాటాకును,
   గోకుడులో నేను కుండగోకుడును సుమీ,

(కుండగోకుడు = నస, గొణుగుడు, పోరు )

బాకులలో పిడిబాకును,

పాకలలో రెల్లుగడ్డిపాకను నేనే.

5. ఊకలలో వరి ఊకను,

కేకలలో నేను గావు కేకను పార్థా!

టీకలలో టుప్టీకను,

తోకలలో నేను కుక్కతోకను సుమ్మీ!

(ఊక = సన్న పొట్టు, టుప్-టీక = బాగా లఘు టీక, అక్కడక్కడ అర్థాలు చెప్పేది.)

6. మేకులలో మరమేకును ,

సాకులలో నేను కుంటిసాకును పార్థా!

ఈకలలో నెమలీకను,

నాకుడులో జూడ పెయ్యనాకుడు నేనే.

(పెయ్యనాకుడు = జుట్టు రాలిపోయే రోగం)

7. పీకుడులందు నేను యమపీకుడు,చూపులవెర్రిచూపు నేన్,

పోకడలందు నేను పెడపోకడ, దోసల నక్కదోస నేన్,

చీకటులందు నే కటికి చీకటి, పాముల పూడుబాము నేన్,

కాకులలోన నే జెముడు కాకిని, కొండల నల్లగొండ నేన్.

(పూడు బాము = మందకొడి  జాతి పాము)

8. కొక్కులను పందికొక్కును,

ముక్కులలో నేను బుర్ర ముక్కును పార్థా!

చుక్కలలో చేర్చుక్కను,

తొక్కలలోకెల్ల అరటితొక్కను నేనే!

(చేర్చుక్క = నుదుట పెట్టే చుక్క)

9. తిక్కలలో తలతిక్కను,

లెక్కలలో నేను చిక్కులెక్కను సుమ్మీ!

నొక్కులను దౌడనొక్కును,

రెక్కలలో నేను తలుపురెక్కను విజయా!

(దౌడ నొక్కు = ఆశ్చర్య పడటం)

10. మొక్కలను కలుపుమొక్కను,

ఢక్కలలో నేను కంచు ఢక్కను పార్థా!

కుక్కులను నులకకుక్కిని,

తొక్కులలో పాతచింతతొక్కును నేనే!

(నులక కుక్కి= వదులై గుంటపడ్డ నులక మంచం)

11. చెక్కలను టేకుచెక్కను,

నిక్కులలో నేన్ నియోగి నిక్కును పార్థా!

పొక్కులను చెమటపొక్కును,

కొక్కెరలన్ నేను గుడ్డికొక్కెరను సుమీ!

12. కుక్కలందున వీధికుక్కను నేనౌదు,
పందులందున నూరబందినౌదు,
నక్కలందున గుంటనక్కను నేనౌదు,
సందులందు నిరుకు సందు నౌదు,
చెక్కలందున పోకచెక్కను నేనౌదు,
మందులందున మత్తు మందు నౌదు,
లెక్కలందున కాకిలెక్కలు నేనౌదు,
గొందులందున ఆనెగొంది నౌదు,
ఇందు నందు ననక, నెందైన నేదైన,
మంచి సెబ్బరనక, మహిని జూడ
గలుగు వెల్ల నేను గాక వేరను మాట
లేదు, దీని కెదురు లేదు విజయ! (సీసము)

(ఆనెగొంది = రాయల రాజధాని ఐన హంపి దగ్గర ఒక ప్రదేశం)

13. అక్షులలో ఏకాక్షిని,
పక్షులలోకెల్ల అక్కుపక్షిని నేనే,
ఇక్షులలో పుండ్రేక్షును,
భిక్షులలో నేనె ఆదిభిక్షును గానే.

(ఇక్షు=చెరకు, పుండ్రేక్షు = నామాల చెరకు)

14. ద్రాక్షలలో రుద్రాక్షను,
మోక్షములన్ నేను బంధమోక్షము పార్థా!

కుక్షులలోన నిరక్షర

కుక్షిని, కోష్ఠములలో ప్రకోష్ఠమును సుమీ!

(కోష్ఠము=అర, ప్రకోష్ఠము=ముంజేయి )

15. పొంగులను పాలపొంగును ,

బొంగులలోపల సవారి బొంగును క్రీడీ!

దొంగలలో గజదొంగను,

రంగములందెన్నగ చదరంగము నేనే!

16. రాగులలో బైరాగిని,

ఈగలలో నేను తేనెటీగను పార్థా!

పోగులలో చెవిపోగును,

గోగులలో నేను కొండగోగును సుమ్మీ!

17. దగ్గులలో పొడిదగ్గును,

వగ్గులలో నేను ముసలివగ్గును విజయా!

బొగ్గుల రక్కసిబొగ్గును

ముగ్గులలో నేను రథము ముగ్గును సుమ్మీ!

18. అంచులలో సరిగంచును,

పంచెలలో నేను పట్టుపంచెను సుమ్మీ!

మంచులలో పొగమంచును,

సంచులలో నేను గోనె సంచిని పార్థా!

(సరిగ అంచు =పంచెలకు ఉండే బంగరు అంచు)

19. చిచ్చులలో కార్చిచ్చును,

బొచ్చులలో నేను గొర్రె బొచ్చును విజయా!

ఎచ్చులలో కమ్మెచ్చును,

పుచ్చులలో నేను వెర్రిపుచ్చను సుమ్మీ!

(కమ్మెచ్చు = లోహాన్ని కమ్మీలుగా పోతపోయటం)

20. పీచులలోపల కొబ్బరి

పీచును, పెంకులను కుండ పెంకును నేనే,

నాచులను నంగనాచిని,

గోచులలో నేను పుట్టగోచిని విజయా!

(నంగనాచి= జాణ ఐ ఉండి కూడ అమాయికత్వం నటించే స్త్రీ)

21. పాచులను పళ్ళపాచిని,

పేచీలన్ నేను మడత పేచీని సుమా!

ఊచలలో గొడుగూచను,

త్రాచులలో నేను నల్లత్రాచును విజయా!

22. కుచ్చులలో జడకుచ్చును,

ముచ్చులలో నేను కొండముచ్చును సుమ్మీ!

పెచ్చులలో పైపెచ్చును,

మచ్చలలో నేను పుట్టుమచ్చను పార్థా!

23. గజ్జెలలో చిరుగజ్జెను,

మజ్జిగలో నేను నీళ్ళమజ్జిగను సుమీ!

సజ్జలను  పూలసజ్జను

బజ్జులలో మిరపకాయ బజ్జిని నేనే!

(సజ్జ=బుట్ట)

24. గింజలలో గురిగింజను,

అంజనములలోన నేనె అమృతాంజనముస్,

అంజలలో ముందంజను,

గుంజలలో పసులపాక గుంజను నేనే!

25. లాజలలో వరిలాజను,

పూజలలో నేను బడితపూజను విజయా!

రోజులలో నవరోజును,

కాజలలో కాకినాడకాజను నేనే!

(లాజ=పేలగింజ, నవరోజు = పార్సీల ఉగాది పండుగ )

26. రాజులలోన తరాజును,

వాజులలోపలను  నే జవాజిని పార్థా,

జాజులలో విరజాజిని,

యాజులలోకెల్ల సోమయాజిని నేనే,

(జవాజి=ఒక సుగంధద్రవ్యం.)

27. అంటులలో తలయంటును,

గుంటలలో నేను గంజిగుంటను విజయా!

బంటులను రామబంటును,

మంటలలో నేను భోగి మంటను పార్థా!

28. పాటులను కునికిపాటును,

కాటులలో నేను దోమ కాటును సుమ్మా!

తేటల మజ్జిగ తేటను,

పీటలలో నేను పెళ్ళిపీటను పార్థా!

29. ఆటలలో కోలాటను,

పాటలలో నేను జోలపాటను విజయా!

వేటలలో పులివేటను,

తోటలలో తమలపాకు తోటను సుమ్మీ.

30. చేటలను చింకిచేటను,

పోటులలో నేను దర్భపోటును విజయా!

కోటలను రాతి కోటను,

పేటలలో నేను కొత్తపేటను సుమ్మీ!

(దర్భపోటు= తద్దినం తంతులో ఒక ప్రక్రియ. 'భోక్తగా ఉండటం' అని భావం.)

31. పుటములలో సంపుటమును,

ఘటములలో నేను మొండి ఘటమును పార్థా!

కటములలో సంకటమును,

చిటుకలలో చెక్కభజన చిటుకలు నేనే!

(సంపుటం=కొన్ని పుస్తకాల కట్ట)

32. పుట్టలను పాము పుట్టను,

పెట్టులలో నేను చెంప పెట్టును పార్థా!

గుట్టులలో లోగుట్టును,

తట్టలలో నేను పేడతట్టను సుమ్మీ!

33. కట్టలలో కరకట్టను,

కుట్టులలో బమ్మకమ్మి కుట్టును నేనే !

అట్టులలో పెసరట్టును,

తెట్టెలలో నేను తేనె తెట్టెను పార్థా!

(కర కట్ట= నది ఒడ్డున కట్టిన కట్ట, బమ్మకమ్మి = పంచెల అంచులలో ఒకరకం )

34. ఉట్టెలలో చింతుట్టెను,

పిట్టలలో నేను బుర్రు పిట్టను విజయా!

మెట్టులలో పైమెట్టును ,

పట్టలలో నేను వార్పుపట్టను సుమ్మీ!

(వార్పు పట్ట = గంజి వార్చేటప్పుడు వాడే గోనెపట్ట)

35. కట్టులలో తాకట్టును,

కట్టెలలో నేను మొండికట్టెను పార్థా!

చుట్టలలో పొగచుట్టను,

పొట్టలలో నేను బానపొట్టను విజయా!

(మొండి కట్టె= మూర్ఖుడు)

36. ఇష్టులలో శుష్కేష్టిని,

అష్టకములలోన మంగళాష్టకమును నేస్,

పుష్టుల భోజనపుష్టిని,

దృష్టులలో నేను దూరదృష్టిని విజయా!

(శుష్క-ఇష్టి = నేర్చుకోవటంకోసం, ఏ వస్తువులూ లేకుండ, వట్టిగా చేసే యాగం. మణళాష్టకాలు =లగ్నం అప్పుడు చదివే ఎనిమిది మంగళశ్లోకాలు.)

37. చెండులలో విరిచెండును

గుండులలో నేను బోడిగుండును సుమ్మీ!

ఎండలను మండుటెండను,

పుండులలో నేను రాచపుండును పార్థా!

(విరి చెండు =పూల బంతి)

38. గండములన్ యమగండము,

పిండములన్ నేను మూత్రపిండమును సుమీ!

దండములన్ కోదండము,

దొండలలో నేను కాకిదొండను విజయా!

(దండము=శిక్ష, కోదండము = ఒక రకమైన శిక్షకు పేరు. కోదండం అనే కొయ్యకు వేలాడదీయటం. ఒక్కొక్క సారి, కింద మంట కూడ పెట్టుతారు.)

39. పండుగలలో నుగాదిని,

దండుగలన్ నేను శుద్ధదండుగను సుమీ!

దండలలో కైదండను,

బండలలో నేను చట్టుబండను విజయా!

(చట్టుబండ = మొద్దు విద్యార్థి)

40. మడతలను చలువమడతను,

మిడుతలలో గొల్లభామ మిడుతను నేనే!

తడకల తప్పులతడకను,

పిడుకలలో ఆవుపేడపిడుకను నేనే!

(చలువ మడత = ఉతికి ఆరవేసిన వస్త్రం)

41. అడవులలో కారడవిని,

మడుగులలో మంచినీటి మడుగును నేనే!

గడలందు చెరకుగడ నే,

నడుగులలో నేను తప్పటడుగును పార్థా!

42. కుడుపులలో మనుగుడుపును,

కడుపులలో నేను పొత్తికడుపును పార్థా!

పొడుపులలో నెలపొడుపును,

ముడుపులలో నేను ముద్రముడుపును సుమ్మీ

(మనుగుడుపు=కొత్త అల్లుడికి అత్త వారి ఇంట చేసే విందులు)

43. నుడులలో జూడ నానుడి నా స్వరూపమ్ము,

బడులలోపల పెట్టుబడిని నేను

గుడులలోకెల్ల వాగుడు నా స్వరూపమ్ము

తడులలోపలను చిత్తడిని నేను,

వడలలో నెంచ నావడ నా స్వరూపమ్ము,

పొడులలోపల ముక్కుపొడిని నేను,

గొడుగులందున పుట్టగొడుగు నా రూపమ్ము,

పిడుగులందున పిల్లపిడుగు నేను,

జడలలోన ఒంటిజడ నాస్వరూపమ్ము,

ముడులలోన పీటముడిని నేను.

పిడతలందు పాల పిడతనా రూపమ్ము,

పుడకలందు ముక్కు పుడక నేను. (సీసము)

44. పీడలలో గ్రహపీడను,

గోడలలో నేను మొండిగోడను సుమ్మీ!

నీడలలో క్రీనీడను,

నాడులలో నేను జీవనాడిని విజయా!

45. నాడులలో పలనాడును,

దాడులలో నేను మెరుపుదాడిని సుమ్మీ!

గాడులలో గిజిగాడును,

గూడులలో నేను సాలెగూడును విజయా!

(గిజిగాడు = ఒక పక్షి, దీని గూడు అల్లిక వింతగా ఉంటుంది.)

46. బిడ్డలలో పసిబిడ్డను,

గొడ్డులలో కాలితీట గొడ్డును నేనే!

గడ్డలలో సెగగడ్డను,

తెడ్డులలో నేను పప్పుతెడ్డును పార్థా!

(కాలితీట గొడ్డు = ఒకచోట నిలవక, ఎప్పుడూ ఎటో పోతూ ఉండే పశువు)

47. గుడ్డలలో మడిగుడ్డను,

గుడ్డులలో నేను పుట్టుగుడ్డిని పార్థా!

పెడ్డలను మట్టిపెడ్డను,

లడ్డులలో నేను రవ్వలడ్డును సుమ్మీ

48. వేణులలోన త్రివేణిని,

కోణములన్ నేను కుంభకోణమును సుమీ!

ఠాణలలోన అఠాణను,

వాణులలోపల భవిష్యవాణిని నేనే!

(అఠాణ = ఒక రాగం పేరు)

49. రణములలో వ్యాకరణము,

కణములలోకెల్ల అగ్నికణమును నేనే!

గణములలోపల భగణము,

క్షణములలో నేను చివరి క్షణమును పార్థా!

(భ-గణం = నక్షత్రాల రాశి)

50. గంతులను కుప్పిగంతును,

దంతమ్ములలోన జ్ఞానదంతము నేనే!

ముంతలలో పొగముంతను ,

గొంతులలో నేను కీచుగొంతును విజయా!

51. దాంతులలో వేదాంతిని,

బంతులలోకెల్ల ఒజ్జబంతిని నేనే!

సంతలలో మడిసంతను,

పుంతలలో నేను పాలపుంతను విజయా!

(ఒజ్జ-బంతి = గురువు వ్రాసి ఇచ్చే పెద్ద పెద్ద అక్షరాల వరుస, మడి సంత=కోట లోపల జరిగే సంత. కోట బయట జరిగేది మైల సంత.)

52. ఈతలలో మునుగీతను,

పోతులలో నేను తాగుబోతును పార్థా!

మాతలలో జామాతను,

గీతలలో నేను కల్లు గీతను సుమ్మీ

(మునుగు-ఈత = నీటిలో మునిగి ఉండి ఈదటం)

53. గతములలో స్వాగతమును,

మతములలో నేను రెట్టమతమును పార్థా!

కతములలో ఏకతమును,

మెతుకులలో నేను పిట్టమెతుకులను సుమీ!

( ఏకతము=ఏకాంతం. రెట్టమతము = రెట్టుడు అనే ఆయన వ్రాసిన శకునశాస్త్రం.)

54. రాతలలో తలరాతను,

కోతలలో నేను గుండెకోతను పార్థా!

వాతలలో తరువాతను,

నూతులలో పాడుబడ్డ నూతిని నేనే!

55. ఊతలలో చేయూతను,

తీతలలో నేను కొంపతీతను పార్థా!

మూతులను పేడిమూతిని,

చేతులలో నేను మదనచేతులను సుమీ!

(మదనచేతులు = దంతెలు, ఇంటి ద్వారబంధం మీది అడ్డదూలాలు)

56. పత్తులలో ఆపత్తును ,

వత్తులలో నేను కొవ్వువత్తిని పార్థా!

చిత్తులలో కించిత్తును,

జిత్తులలో నేనె ఇంద్రజిత్తును సుమ్మీ!

(కిం-చిత్ = కొంచెం)

57. వృత్తులలో కులవృత్తిని,

తొత్తులలో నేను మురికితొత్తును సుమ్మీ!

కత్తులలో చురకత్తిని

గుత్తలలో నేను గుండుగుత్తను విజయా!

(గుండు గుత్త= అన్నిటికీ కలిపి ఒకే మొత్తం వెల )

58. పూతలలో పైపూతను,

మోతలలోకెల్ల మారుమోతను నేనే

తాతలలో ముత్తాతను,

వేతలలో నేను తీసివేతను విజయా!

59. పోతలలో వడపోతను,

పాతలలో నేను చింకిపాతను పార్థా!

కూతలను కారుకూతను,

నీతులలో నేను రాజనీతిని సుమ్మీ!

60. తిత్తుల నూపిరి తిత్తిని,

పొత్తులలో మొక్కజొన్నపొత్తును నేనే!

విత్తులను వేరువిత్తును,

కత్తెరలస్ నేను గండకత్తెరను సుమీ!

(వేరు విత్తు = సర్వనాశకుడు, గండకత్తెర = తన తలను తానే నరకుకొనే

కీలు కత్తి)

61. ఎత్తులలో ఉబ్బెత్తును,

పత్తులలో నేను బమిడి పత్తిని పార్థా!

బత్తులలో నౌబత్తును,

మత్తులలోకెల్ల నిద్రమత్తును నేనే!

(బమిడి/భమిడి పత్తి = వత్తులు చేసుకొనే పత్తి, నౌబత్తు = ఢంకా)

62. వీథులలో తిరువీథిని,

గాథలలో నేను వీరగాథను సుమ్మా!

నాథలలోన అనాథను,

పీథులలో నేను సోమపీథిని విజయా!

(సోమపీథి = యాగాలలో సోమరసాన్ని త్రాగిన వాడు)

63. అర్థులలో అభ్యర్థిని,

అర్థమ్ములయందు నేనపార్థమును సుమీ!

అర్థముల నుత్తరార్థము,

శర్థమ్ములలోపల గజశర్థము నేనే

( ఉత్తరార్థము=రెండవ సగం. శర్ధం= అపానవాయువు)

64. గేదెలను గౌడి గేదెను,

బీదలలో నేను పాలబీదను విజయా !

వేదులను స్పర్శవేదిని

వాదులలోపల వితండవాదిని నేనే!

(పాల బీద = తల్లి పాలు తగినంతగా అందని శిశువు)

65. సందెలలో తొలిసందెను,

బిందెలలో నేను లంకెబిందెను సుమ్మీ!

బందులను మడతబందును,

పిందెలలో కుక్కమూతిపిందెను నేనే!

(లంకె బిందె=ఒకదానితో మరొకటి లంకె వేసి ఉన్న బిందెలు)

66. వేదములను నిర్వేదము,

పాదములన్ నేను హంసపాదమును సుమీ!

వాదములలో ప్రవాదము,

నాదమ్ములలోన ఆర్తనాదము నేనే !

(హంసపాదం= వ్రాతలో తప్పు పడ్డ చోట ఉంచే గుర్తు.)

67. ఆదులలో దాయాదిని,

సూదులలో నేను గుండుసూదిని పార్థా!

మాదులలోన ప్రమాదిని,

భేదులలో నెన్నగ నగభేదిని నేనే!

(ప్రమాది =పొరబడేవాడు, నగ-భేది =ఇంద్రుడు)

68. ఎద్దులలో గంగెద్దును,

సుద్దులలో నేను గొల్లసుద్దిని సుమ్మీ!

బద్దల కావడి బద్దను,

ముద్దులలో నేను తుమ్మముద్దును పార్థా!

(గొల్ల సుద్ది = ఒక రకమైన జానపద కథాకళ)

69. బుద్ధులలో సంబుద్ధిని,

శుద్ధులలో నేను చిత్తశుద్ధిని పార్థా!

వృద్ధులను చక్రవృద్ధిని,

సిద్ధులలో నేను కాయసిద్ధిని సుమ్మీ!

(సంబుద్ధి =సంబోధన, చక్ర-వృద్ధి -చక్రవడ్డీ)

70. కన్నులందున మెల్ల కన్నును నేను

వెన్నులందున వరివెన్నును నేను,

జున్నుల తంగెటిజున్నును నేను,

పన్నులం దాయపు పన్నును నేను. (ద్విపద)

(ఆయపు పన్ను = ఆదాయపు పన్ను)

71. అన్నలలో మాదన్నను,

దున్నలలో నేను దుక్కిదున్నను విజయా!

గున్నలను మావిగున్నను,

గిన్నెలలో నేను నేతి గిన్నెను పార్థా!

72. మునుకలలో తలమునుకను,

దినుసులలో నేను వంటదినుసులు పార్థా!

దినములలో తద్దినమును,

వనములలో నేను నవకవనమును సుమ్మీ!

(నవకవనం= కొత్త కవిత)

73. మీనులలో కొరమీనును,

కానులలో నేను చిల్లికానిని పార్థా!

చేనులలో వరిచేనిని,

బోనులలోకెల్ల ఎలుకబోనును నేనే!

(కాని =పాతకాలపు నాణెము, 1/64 రూపాయి. వీనిలో ఒకరకం కానికి ఒక చివర చిల్లి ఉండేది.)

74. దానములను గోదానము,

పానములన్ నేను మద్యపానము విజయా!

మానములం దనుమానము,

తానములందెన్న నే వితానమును సుమీ!

(వితానము=1. పందిరి, 2. యాగము)

75. వంపులలో తలవంపును ,

దుంపలలో నేను కందదుంపను పార్థా!

తెంపులలో తెగదెంపును,

గంపలలోన కలగూరగంపను నేనే ,

(తెగదెంపు= ఒకవిషయంతో సంబంధం తెంచుకోవటం)

76. అప్పులలో పాతప్పును

నొప్పులలో నేను గుండెనొప్పిని విజయా!

ఉప్పులలో పెట్లుప్పును,

తిప్పలలో నేను ముప్పుతిప్పలను సుమీ!

77. కుప్పలను మట్టికుప్పను,

తప్పులలో నేను శుద్ధతప్పును పార్థా!

కొప్పులలో పెడకొప్పును,

పప్పులలో నేను ముద్దపప్పును సుమ్మీ!

78. తీర్పులలో తుదితీర్పును,

కూర్పులయందెల్ల నచ్చుకూర్పును నేనే!

ఊర్పులలో నిట్టూర్పును,

చేర్పులలో నేను గోడచేర్పును విజయా!

(అచ్చు కూర్పు = అచ్చు కోసం అక్షరాలను కూర్చటం)

79. బొబ్బలలో పెడబొబ్బను ,

డబ్బులలో నేను నల్లడబ్బును సుమ్మీ!

దుబ్బులను రెల్లు దుబ్బును,

మబ్బులలో చేపరెక్క మబ్బును నేనే!

(చేప రెక్క మబ్బు= చిన్న చిన్న మబ్బు ముక్కలతో, చేపరెక్కలాగా కనబడే ఆకాశం)

80. నిమ్మలలో గజనిమ్మను,

తమ్ములలో నేను మారుతమ్మును పార్థా!

కమ్మలలో చెవికమ్మను,

బొమ్మలలో నేను దిష్టి బొమ్మను సుమ్మీ!

(మారుతమ్ము=గాలి)

81. అమ్మలలో దద్దమ్మను,

కొమ్మలలో నేను పట్టుకొమ్మను పార్థా!

ఎమ్ములలో కోలెమ్మును,

గుమ్మములన్ నేను కోటగుమ్మమును సుమీ!

(కోల-ఎమ్ము = వెన్నెముక)

82. కమ్ములలో పైకమ్మును,

సొమ్ములలో కెల్ల ఎరవు సొమ్మును నేనే!

జమ్ములలోన నిజమ్మును,

తమ్మెలలో నేను పలుపుతమ్మెను విజయా!

(పలుపు తమ్మె = గేదెను కట్టివేసే తాడు)

83. గీములలో గొబగీమును,

చీమలలో నేను గండుచీమను పార్థా!

గాములలో ఆగామిని,

నామములన్ నేను పంగనామమును సుమీ!

(గొబ=గుహ, గీము=ఇల్లు, ఆగామి=రాబోయేది)

84. సాములలో ఆసామిని,

భూములలో నేను రుద్రభూమిని సుమ్మీ!

హోమముల పాణిహోమము,

కాములలో నేను మోక్షకామిని పార్థా!

(పాణిహోమము= తద్దినంలో ఒక తంతు)

85. మాయలలో పెనుమాయను,

రాయలలో కృష్ణదేవరాయలు నేనే!

ఊయెలల తూగుటుయ్యెల,

పాయలలో  నేను వెల్లిపాయను పార్థా!

86. కొయ్యలలో పెడకొయ్యను,

కయ్యలలో ఉప్పుటేటికయ్యను నేనే!

అయ్యలలో తాతయ్యను,

పొయ్యిలలో నేను గాడిపొయ్యిని పార్థా!

(గాడి పొయ్యి = కట్టెల పొయ్యిగా వాడటానికి, పొడవుగా తవ్విన గుంట )

87. కయ్యముల కన్నెకయ్యము,

దయ్యములన్ నేను కొరవిదయ్యమును సుమీ!

వియ్యముల నెదురు వియ్యము,

బియ్యములన్ నేను వెదురు బియ్యము పార్థా!

(కన్నె కయ్యము =మొట్టమొదటి యుద్ధము, ఎదురు వియ్యము = తమ పిల్లను ఇచ్చిన ఇంటిలోనుండి పిల్లను తాము తిరిగి చేసుకోవటం)

88. విద్యలలో కులవిద్యను,

పద్యములన్ నేను చాటుపద్యమును సుమీ!

వాద్యములన్ ఘటవాద్యము,

గద్యలలో శ్రీనివాసగద్యను నేనే!

(చాటుపద్యం= ఏదో సందర్భంలో ఆశువుగా చెప్పిన  చమత్కారపద్యం)

89. హోరలలో పులిహోరను,

బీరలలో నేను నేతి బీరను విజయా!

తీరులలో పనితీరును,

పారలలో నేను గడ్డపారను సుమ్మీ!

90. దరువులలో ఆదరువును,

వరములలో నేను గన్నవరమును సుమ్మీ!

తరములలో పోతరమును,

పురములలో నే ననంతపురమును విజయా!

(పోతరము = బలుపు, పొగరు)

91. కారములందుపకారము,

బేరములన్ లాభసాటి బేరము నేనే,

హారములం దాహారము,

కూరలలో పెరుగుతోటకూరను నేనే!

92. గోరులలో పులిగోరును,

గారెలలో నేను మినప గారెను విజయా!

బారులలో సాంబారును,

దారులలో నేను పక్కదారిని సుమ్మీ.

93. మారులలో గోమారును
చారులలో నేను పప్పుచారును సుమ్మీ!
జారులలోన బజారును,
పేరులలో కాశికాయ పేరును నేనే.
(గోమారు = పశువుల ఒంటిని అంటి పట్టుకొనే ఒక పురుగు)

94. ఏరులలో కొల్లేరును,
కారులలో నేను పట్టుకారును విజయా!
బేరులలో సోంబేరిని,
దారలలో నేను ధర్మదారను సుమ్మీ!
(ధర్మదార = యుద్ధాన్ని ఆపటానికి గుర్తుగా ఊదే బూర)

95. సరకులలో ముడి సరకును,
చెరకులలో పంచదారచెరకును నేనే!
మెరుపులలో కొసమెరుపును,
చెరువులలో సాగునీటిచెరువును నేనే

96. గారములందు నేను నయగారము, పూరములందు నేను క
ర్పూరము, బొజ్జలందు చిరుబొజ్జను, వారములందు నేను కై
వారము, బొక్కలం దెలుక బొక్కను, భారములందు నేను సం
భారము, వంటలందు మడివంటను, రేవుల చాకిరేవు నేన్,

97. వారులలో ఆళ్వారును,

పోరులలో నేను కోడిపోరును పార్థా!

నీరులలో పన్నీరును,

కోరులలో నేను మిరపకోరును సుమ్మీ!

(ఆళ్వారు = వైష్ణవుల గురువు, కోరు = ఘాటు)

98. పత్రులలో జాపత్రిని,

సత్రములన్ తంజవూరి సత్రము నేనే!

పత్రముల ప్రశ్నపత్రము,

యాత్రలలో నేను తీర్థయాత్రను విజయా!

(జాపత్రి= ఒక సుగంధ ద్రవ్యం)

99. వెర్రులలో కొసవెర్రిని,

బర్రెలలో నేను జడల బర్రెను పార్థా!

కర్రలను చేతికర్రను

గొర్రెలలో నేను కొండగొర్రెను సుమ్మీ!

100. తరువులలో ఉత్తరువును

కురుపులలో నేను నారికురుపును పార్థా!

గురువులను జగద్గురువును,

కరవులలో నేను ధాత కరవును పార్థా!

(ధాత కరవు = ఒకప్పుడు ధాతృనామ సంవత్సరంలో వచ్చిన పెద్ద కరవు)

101. భద్రులలో సౌభద్రుడ,

రుద్రులలోపల ప్రతాపరుద్రుడు  నేనే!

నిద్రలను యోగనిద్రను,

ముద్రలలో నేను జ్ఞానముద్రను పార్థా!

(సౌభద్రుడు =అభిమన్యుడు)

102. మంత్రములన్ తిరుమంత్రము,

తంత్రమ్ములలోన పంచతంత్రము నేనే!

ఆంత్రములను బాలాంత్రము,

యంత్రములన్ నేను మత్స్యయంత్రమును సుమీ!

(బాల-ఆంత్రము = చిన్న పేగు)

103.  ఉల్లులలో వెల్లుల్లిని,

కల్లులలో నేను సన్నెకల్లును సుమ్మా!

గుల్లలను నత్తగుల్లను,

జల్లులలో నేను చిత్తజల్లును పార్థా!

(సన్నెకల్లు = పెళ్ళిలో వాడే ఒక చిన్న గుండు రాయి )

104. పల్లెలలో రేపల్లెను,

కల్లలలో నేను పచ్చికల్లను పార్థా!

పుల్లల పూచికపుల్లను,

బల్లలలో నేను సొరుగుబల్లను సుమ్మీ!

(సొరుగు బల్ల = సొరుగు ఉన్న బల్ల, desk)

105. బిలములలో గబ్బిలమును,

కలములలో బాతుటీక కలమును నేనే!

కులములలో సంకులమును,

జలములలో నేను గంగ జలమును పార్థా!

(బాతు-ఈక-కలము= బాతు ఈకతో చేసిన కలము. ఇది పాతకాలపు కలం.)

106. కూలములలో దుకూలము,

కాలమ్ములలోన గడ్డుకాలమును సుమీ!

జాలముల నింద్రజాలము,

కీలమ్ములలోన ఇంద్రకీలము నేనే!

( దుకూలము= వస్త్రము/పట్టు బట్ట. ఇంద్ర కీలము = ముఖ్యమైన/పెద్ద  చీల)

107. చువ్వల తారాజువ్వను

నవ్వులలో నేస్ ముసిముసి నవ్వును సుమ్మీ!

రవ్వలను నిప్పు రవ్వను

గవ్వలలో నేను చిల్లిగవ్వను విజయా!

(చిల్లి గవ్వ = గవ్వ ఒకప్పుడు డబ్బుగా వాడుకలో ఉండేది. దానిలో చిల్లిపడ్డ గవ్వ  చిల్లిగవ్వ .)

108. క్రోవుల పిల్లనగ్రోవిని,

ఠీవులలో నేను రాచఠీవిని పార్థా!

పావులలో ముప్పావును,

కావులలో నేను నీరుకావిని సుమ్మీ!

109. ఆవులలో పల్లావును,

దీవులలో మెట్టలంక దీవిని నేనే,

లావులలోన పలావును,

చావులలో నేను రాచ చావును సుమ్మీ!

( రాచ చావు = రాజులాగ మరణించటం.)

110. జావలను రాగిజావను,

బావులలో నేను దిగుడు బావిని విజయా!

త్రోవలలో పెడత్రోవను,

గోవులలోకెల్ల గంగిగోవును నేనే.

( గుడ్డి గవ్వ = చెల్లని గవ్వ. గవ్వలు ఒకప్పుడు డబ్బుగా చెల్లేవి.)

111. బువ్వలలో వరిబువ్వను,

నువ్వులలో నేను నల్ల నువ్వులను సుమీ!

మువ్వలలో సిరిమువ్వను

గువ్వలలో నేను గుడ్డిగువ్వను పార్థా!!

112. భాషలలో పరిభాషను,

దోషములందెన్న నే ప్రదోషమును సుమీ,

మేషములలో నిమేషము,

ఘోషలలో నేను ప్రాణిఘోషను పార్థా!

(పరిభాష = సంకేతభాష - terminology,

ప్రాణిఘోష = చెవులలో ప్రేళ్ళు పెట్టుకొన్నప్పుడు జుమ్మని వినబడే మ్రోత.)

113. నాసలలోన అనాసను,

మీసములన్ నేను బుర్రమీసమును సుమీ!

మాసములన్ క్షయమాసము,

పూసలలో నేను కొలికిపూసను పార్థా!

( క్షయమాసము = చాంద్రమానంలో ఒక ఏటిలో లోపించి పోయే నెల.)

114. కాసులలో తిరకాసును,

రాసులలో నేనె ఎబ్బెరాసిని విజయా!

బేసులలో దరిబేసిని,

బాసలలోకెల్ల అడ్డబాసను నేనే

(ఎబ్బెరాసి = ఎడ్డెవాడు, అడ్డబాస = ముక్కుకు కుట్టిన అడ్డకాడ)

115. ఎసరులలో అత్తెసరును,

కసవులలో నేను చిప్పకసవును పార్థా!

రసములను పాదరసమును ,

ఉసిరికలను నేను రాచ ఉసిరికను సుమీ!

(చిప్ప కసవు=ఒక గడ్డి మొక్క, రాచ ఉసిరి =చిన్న ఉసిరి)

116. దాసులలో హరిదాసును,

కాసెలలో నేను వీరకాసెను సుమ్మీ!

ఆసలలో పేరాసను,

వేసములందెల్ల పగటివేసము నేనే!

117. గ్రహణములలోన పాణి

గ్రహణము, కల్పములలోన కాయకల్పము నేనే,

దహనమ్ములలోపల గృహ

దహనము, దండులను రామదండును నేనే!

118. గోళములలోన గందర

గోళము, గుండిగల రాగి గుండిగ నేనే!

తాళులలో ఎగతాళిని,

పాళులలో నేను పంచపాళిని పార్థా!

(గుండిగ = పెద్ద లోహపు పాత్ర, పంచపాళి = వసారా)

119. కేళులలో కంకేళిని,

ప్రేళులలో నేను బొటనప్రేలిని పార్థా!

లీలలను రాసలీలను,

కూలులలో నేను పూటకూలిని పార్థా!

(కంకేళి = అశోకపువ్వు, పూటకూలి = డబ్బు తీసుకొని అన్నం పెట్టటం)

120. ఈగతి నెంత సేపు వచియించినఁ జాలదికిప్పు డాపెదన్,

రాగల కాలమం దవసరమ్ము లభించిన నింకఁ జెప్పెదన్,

బాగుగ దీని సారము ననారతమున్ స్మరియించుచుండు, మే

లాగుననైన నీ కొదవు లాభము, నష్టము కల్గ దింతయున్.

121. అని చెప్పి కృష్ణు డర్జునుఁ
గని యిట్లను “నొక్క మాట గాండీవీ! దీ
నినిఁ బ్రతివానికిఁ జెప్పన్
జన, దెవరికిఁ జెప్పఁ దగునొ సరిగా వినుమీ!”

122. “ పనిపాటు లేని వానికి,
మనకంటెను మందమతికి మాత్రము, వినిపిం
చిన మేలగు, బాగుగఁ జది
వినవానికిఁ జెప్ప, వాడు వెకవెక నవ్వున్. ”

123. అని సాదరముగ వివరిం
చి నిజేచ్ఛన్ గృష్ణుడరిగెఁ జిరునవ్వులతోఁ ;
దనదారిఁ దానుఁ జనియెను
ధనంజయుడుఁ గ్రొత్తగీత తలపుల నెలమిన్.

124. ఈరీతి మెహర్ లక్ష్మికి
దారకు వినిపించె, హాస్య తత్పరమతితో
ధారగ మార్కండేయుడు,
జోరీగలు చెవుల యొద్ద జుమ్మని నట్టుల్.

125. శిష్టులు మెచ్చని రీతి ని
కృష్టపు దుష్టరచన యని కేడింపకుడీ!
దుష్టాదుష్టములన్నవ
భీష్టములస్ బట్టి యుండు, నిది నిజమేకా!

126. నిశ్చిత మిది హాస్యమునకె,
దుశ్చేష్టగఁ జూడవలదు, దుష్ట మనుచు నే
కశ్చనయో యెంచిన, నది
పశ్చిమకక్షారసానుభవమగు నంతే !

జిహ్వేవ హృదయం యేషాం రసాస్వాదేన శోభతే,
తాదృశేభ్యః సమస్తేభ్యో రసికేభ్యో నమో నమః

-*- ఇతి శమ్.-*-

మార్కండేయప్రసాద్. గుంటూరు
విళంబి, చైత్ర శుక్ల ద్వితీయ . 20. 03. 2018.